క్లుప్తంగా

వధూవరులకు ఎమ్మెల్యే బూచేపల్లి ఆశీర్వాదం


వధూవరులతో ఎమ్మెల్యే బూచేపల్లి

తాళ్లూరు (దర్శి): మండలంలోని మాధవరంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త గర్నెపూడి అంకయ్య వివాహానికి దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి గురువారం హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మండలంలోని రజానగరంలో పార్టీ కార్యకర్త అనపర్తి సుబ్బారావు గుండెపోటుతో గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి సుబ్బారావు మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

త్రిపురాంతకం: నేషనల్ హైవేపై రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని దూపాడు వద్ద జరిగిన ప్రమాదంలో అనంతపురానికి చెందిన శివశంకర్‌రెడ్డి, రాము గాయపడ్డారు. గుంటూరు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న లారీ, అనంతపురం నుంచి విజయవాడ వెళ్తున్న ఐషర్ లారీ ప్రమాదానికి గురయ్యాయి. ఐషర్‌లో వీరు ప్రయాణిస్తూ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. వీరిని స్థానికులు హైవే సిబ్బంది బయటకు తీశారు. మెరుగైన వైద్యసేవలకు వినుకొండ తరలించారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో గురువారం ఎంపీడీఓ నాసర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధి పథకానికి సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పంచాయతీలకు సంబంధించి పనులు, నిధుల వివరాలు డీఆర్పీలు అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా మండలంలో సుమారు రూ.16.40 కోట్లతో 544 పనులు నిర్వహించినట్లు ఎస్సార్పీ తోకల వెంకటేశ్వర్లు తెలిపారు. మండల వ్యాప్తంగా జరిగిన పనుల్లో రూ.1.60 కోట్ల వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ అర్జున్‌రావు, డీడీఓ ఝాన్సీరాణి, ఏపీడీ నిర్మలారాణి, ఏడీఓ వెంకటస్వామి, ఎస్ఆర్పీ వెంకటేశ్వర్లు, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ కోసం అనుమతి తీసుకోవాలి

దర్శి: గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకునే వారికి విద్యుత్ సరఫరా కోసం అనుమతి తీసుకోవాలని, మీ సేవాల ద్వారా గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఈ వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ లైన్ కింద, ఆనుకుని, పక్కన మండపాలు ఏర్పాటు చేసుకోవాలంటే సంబంధిత అసిస్టెంట్ ఇంజినీర్, పోలీస్ నో అబ్జక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో అటువంటి మండపాలకు అనుమతులు లభించవని హెచ్చరించారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పుల్లలచెరువు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో ఇందిర ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని శతకోడు ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. నిరంతరం ఉపాధ్యాయులు తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల వివరాలు, నాడు-నేడు, మధ్యాహ్న భోజనానికి సంబంధించి రికార్డులు పరిశీలించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికిపూలమాలవేసి నివాళులర్పించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

దర్శి: మండలంలోని రాజంపల్లి, కొత్తపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గురువారం ఏఈ వేణుగోపాల్ తెలిపారు. రైల్వే క్రాసింగ్ వద్ద పవర్ గ్రిడ్ వాళ్లు 500 కేవీ పవర్ లైన్, 11కేవీ పవర్ లైన్‌లు, 33 కేవీ పవర్ లైన్‌ల నుంచి ఎల్‌సీ తీసుకున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పుల్లలచెరువు ఎస్‌ఐగా బాబూరావు


బాధ్యతలు చేపట్టిన బాబూరావు

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువు ఎస్‌ఐగా బత్తుల బాబూరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా ఇక్కడ ఎస్‌ఐ లేక పోవడంతో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు బాబూరావు ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక స్టేషన్ సిబ్బంది నూతన ఎస్‌ఐని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు


పుల్లలచెరువు: సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


దొనకొండ: నరసింహారావును సన్మానిస్తున్న డీఈఓ, అధికారులు


వై.పాలెం రెయిన్‌బో హైస్కూల్లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీపీ కిరణ్‌గౌడ్

పుల్లలచెరువు: సమాజానికి మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులేనని ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి అన్నారు. గురువారం మండలంలోని పలు పాఠశాలల్లో భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయింతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందన్నారు. సమాజానికి దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులేనని ఆయన వారి సేవలను కొనియాడారు.

దొనకొండ: గురు పూజోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం ఒంగోలులోని ప్రకాశం భవన్ ప్రజావేదికలో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర హాజరై ఉపాధ్యాయ దినోత్సవం ప్రాముఖ్యత వివరించారు. ఈ సందర్భంగా దొనకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించిన కె.నరసింహారావును విద్యాశాఖాధికారి డి.సుభద్ర, అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

దర్శి: మండలంలో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తూర్పువీరాయపాలెం ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు రవిబాబు, ఉపాధ్యాయులు అట్లూరి రామారావును ఘనంగా సత్కరించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారం పొంది పదేళ్లు పూర్తి అయిన సందర్భంగా పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయులు సైన్స్, సోషల్‌కు సంబంధించిన బోధనా పరికరాలను ఎస్టీ కాలనీలోని ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి పిల్లలకు రాత మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.రఘురామిరెడ్డి, చైర్మన్ పోలేష్, ఉపాధ్యాయులు జ్యోతి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఆంజనేయులు, అశ్విని, మస్తాన్‌బీ పాల్గొన్నారు. కట్టశింగన్నపాలెంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు గొర్రెపాటి వేణు, పి.సుధాకరరావుల పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరింపజేశాయి. ఉపాధ్యాయులు సీహెచ్ హైమావతి, సయ్యద్ సుభానీ పాల్గొన్నారు.

పెద్దారవీడు: ఉపాధ్యాయ వృతి పవిత్రమైందని, మనం అందరం కూడా పవిత్రంగా భావించాలని ఎంపీడీఓ రాజ్‌కుమార్, తహసీల్దార్ శైలేంద్రకుమార్ అన్నారు. స్థానిక విద్యా శాఖ కార్యాలయంలో ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవం ఉపాధ్యాయులు గురువారం నిర్వహించారు. రాధాకష్ణన్ చిత్రపటానికి అధికారులు, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్‌కి విద్యార్థులకు శిక్షణ అంకిత భావంతో కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలు తెలియజేశారు. మండలంలో విద్యార్థులకు విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులకు అవార్డులు అందజేయడంతో పాటు శాలువా, పూలమాలతో అధికారులు ఘనంగా సత్కరించారు. ఎంఈఓ 1,2లు పి.శ్రీనివాసులు, ఎస్‌పీ సుబ్రహ్మణ్యం, యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.శ్రీరాములు, నాయకులు ప్రభాకర్, యలమందారెడ్డి, శ్రీనివాసులు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండలంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సావిత్రి, అధ్యాపకులు పాల్గొన్నారు. దీంతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఫాదర్ పెర్రర్ ఆడిటోరియంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

ముండ్లమూరు (దర్శి): ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని శంకరాపురం, పసుపుగల్లు గ్రామాల్లో గురువారం జరిగిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి ఉప రాష్ట్రపతిగా విస్తృత సేవలు అందించిన ఘనత ఆయన సొంతమన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తిపై ప్రజలకు అపారమైన గౌరవం ఉందన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పసుపుగల్లులో కుకింగ్ హెల్పర్, ఉపాధ్యాయురాలు రజనీ, అంకమ్మలను పాఠశాల హెచ్ఎం పూర్ణచంద్రరావు, గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

యర్రగొండపాలెం: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో ఉత్తమ సేవలు అందించిన 8 మంది ఉత్తమ ఉపాధ్యాయులు ఆర్.మాలకొండనాయక్, సీహెచ్ విన్‌సెంట్, పి.రాఘవరావు, జీవీఎల్ఎస్ మూర్తి, బి.పెద్దపాపారావు, షేక్ కాలేషావలి, ఆర్.వెంకటేశ్వర్లు నాయక్, ఎం.జోబ్‌లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందచేశారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు విద్యాలయాలు రెయిన్‌బో, కృష్ణవేణి, నలంద పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లా నాయక్, డాక్టర్ యదిద్యా ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

తాళ్లూరు (దర్శి): మండలంలో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. బొద్దికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు పి.సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ వెదురూరి వెంకరామిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.అంజిరెడ్డి, 16 మంది ఉపాధ్యాయులను ఆర్‌పీ షేక్ కాలేషావలి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులకు పెన్నులు బహూకరించారు. ఉపాధ్యాయులు సురేష్, ధనలక్ష్మి, ప్రభాకర్, సుబ్బారావు, రామిరెడ్డి పాల్గొన్నారు.

కురిచేడు: తల్లిదండ్రుల వద్ద నేర్చుకోలేని సంస్కారవంతమైన జీవితం క్రమశిక్షణ కలిగిన గురువు ద్వారానే సాధ్యమవుతుందని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి పేర్కొన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో విద్యావనరుల కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి పుస్తకాల్లోని విద్యతో పాటు సంస్కారాన్ని నేర్పి గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దటం గురువులకే సాధ్యమన్నారు. తల్లి,తండ్రి తర్వాత స్థానం సంపాదించిన మహోన్నత మైన వ్యక్తి గురువేనని ఎంపీడీఓ కుసుమకుమారి పేర్కొన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన కేవీకే నాగమణి, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎన్నికైన వి.స్వాతి, కె. ఆదిలక్ష్మి, అన్వర్‌బాషా, బి.రమాదేవి, ఊట్ల శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు. ప్రశంసపత్రాలు అందజేశారు. ఎంఈఓ వస్త్రాంనాయక్, బోధనంపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. పాపారావు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కురిచేడు: సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు


తాళ్లూరు: బొద్దికూరపాడులో సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు


వై.పాలెంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవోలు


పెద్దారవీడు: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓలు


ముండ్లమూరులో..



పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..


దర్శి: అట్లూరి రామారావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

విక్రయాలకు గణనాథులు సిద్ధం


భారీగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు


టేకు వినాయకుడు..


ఆకట్టుకున్న రథంపై వినాయకుడు

దర్శి: నియోజకవర్గంలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పొదిలి రోడ్డులోని వినాయక విగ్రహాలు తయారీదారు రాజు 120 విగ్రహాలు తయారు చేశారు. అందులో 100 విగ్రహాలు వరకు సేల్స్‌కాగా ఇంకా 20 విగ్రహాలు మిగిలి ఉన్నాయి. ఈ విగ్రహాలు కూడా భక్తులు కొనుగోలు చేస్తే తమకు గిట్టుబాటు అవుతుందని రాజు తెలిపారు. ఇప్పటి వరకు తక్కువ ఎత్తు విగ్రహాలు మాత్రమే సేల్స్ అయ్యాయని, పెద్ద పెద్ద భారీ విగ్రహాలు మాత్రం అలాగే ఉన్నాయన్నారు. ఏటా భారీ విగ్రహాలకు ఎక్కువ డిమాండ్ ఉండేదన్నారు. ఈ ఏడాది చిన్న విగ్రహాలు భారీగా విక్రయించామని, భక్తులు భారీ విగ్రహాలపై ఆసక్తి చూపడం లేదని చెప్పారు. రకరకాలు రథాలపై, మూషిక వాహనాలపై ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు అందరినీ ఆకట్టుకున్నాయి.

పటిష్ట చర్యలు

విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు చెప్తున్నారు. ఫైర్, ఇతర అనుమతులు తీసుకుని భక్తిశ్రద్ధలతో వినాయక చవితి జరుపుకోవాలని సూచిస్తున్నారు. భక్తి పాటలతో వినాయక స్వామిని పూజించి నిమజ్జనం కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. నిమజ్జనం సమయంలో మద్యపానం పూర్తిగా నిషేధిస్తున్నట్లు తెలిపారు. అలా చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

జేసీ ఆదేశాలు అమలు చేయాలి


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

తాళ్లూరు (దర్శి): జాయింట్ కలెక్టర్ ఆదేశాలు అమలు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో చింతలపాలెం రెవెన్యూలో భూవివాదాన్ని ఆయన స్థానిక తహసీల్దార్ శింగారావు దృష్టికి తీసుకొచ్చారు. అవే భూముల్లో మరో 10 ఎకరాలు భూమి లేని ఎస్సీ, ఎస్టీలు సాగు చేసుకుంటున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలు సాగు చేసుకుంటున్న భూములపై కన్నేసిన ఆ గ్రామ భూస్వాములు భూకబ్జాకు పాల్పడ్డారన్నారు. ఆ భూమిపై జాయింట్ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ వెంటనే వీఆర్వో రమణారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మూర్తి, సర్వేయర్ బాబూరావులను పిలిచి రిపోర్ట్ తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనపర్తి ఆదాం, ఎమ్మార్పీఎస్ నాయకులు గర్నెపూడి యోహాను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


తలకు తీవ్రగాయాలతో రోడ్డుపై పడి ఉన్న దిబ్బయ్య


అంకారావును కారులో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ముండ్లమూరు(దర్శి): మండలంలోని వేముల వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం..మండలంలోని రమణారెడ్డిపాలెం గ్రామానికి చెందిన రాయపూడి దిబ్బయ్య గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై సమీపంలోని వేములకు వ్యక్తిగత పని నిమిత్తం వెళ్లారు. తిరిగి స్వగ్రామం వెళ్తుండగా మార్గమధ్యలో ఈదర నుంచి దర్శి వైపు ద్విచక్ర వాహనంపై కుటుంబసభ్యులతో వెళ్తున్న యరగుంట్ల అంకారావులు ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో దిబ్బయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి, అంకారావుకు కాలు విరిగింది. అదృష్టవశాత్తు అంకారావు భార్యా పిల్లలు పక్కనే ఉన్న గడ్డిలో పడడంతో ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న అంకారావు బంధువులు గాయాలపాలైన అంకారవును కారులో దర్శికి తరలించారు. అంకారావు స్వగ్రామం కురిచేడు మండలం దేకనకొండ కాగా అత్త వారింటికి ఈదరకు భార్యా పిల్లలతో వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తున్నాడు. తలకు తీవ్ర గాయాలైన దిబ్బయ్యను 108 వాహనంలో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సాగుకు అనువైన భూమిని గుర్తించాలి

దొనకొండ: మండలంలో సాగుకు అనువైన బీడుగా ఉన్న భూములను గుర్తించాలని దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్‌లతో తహసీల్దార్ రమాదేవి అధ్యక్షతన గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని సాగు భూమి, 5 సంవత్సరాలుగా సాగు చేయని పొలాలను గ్రామ స్థాయిలో సర్వే నంబర్లు గుర్తించి నివేదిక అందజేయాలన్నారు. అలా గుర్తించిన ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు బయో డీజిల్ మొక్కలు పెంచటం, సోలార్ విద్యుత్ కోసం భూమిని ఉపయోగిస్తారని తెలిపారు. దొనకొండ ప్రాంతంలో 13 వేల హెక్టార్లు పొలం ఉన్నట్లు సమాచారం. రెవెన్యూ అధికారులు ఈ విషయంలో ఆలస్యం చేయకుండా నివేదికను త్వరితగతిన అందజేయాలని బాలాజీనాయక్ కోరారు.

ఆరవల్లిపాడులో పోషకాహార మహోత్సవాలు

దొనకొండ: మండలంలోని ఆరవల్లిపాడు-2 ఏడబ్ల్యూసీలో గురువారం పోషకాహార మహోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రంలో సరఫరా చేసే గుడ్లు, పాలు, బాలామృతం, న్యూట్రిన్ కిట్‌లోని రాగిపిండి, బెల్లం, ఎండు కర్జూరాలు, చిక్కీల్లో ఉండే పోషకాలు గురించి వివరించారు. పప్పు ధాన్యాలు, పండ్లు, ఆకు కూరలు తినటం ద్వారా కార్బోహైడ్రేట్‌లు, ప్రొటీన్లు, పొటాషియం, ఫాస్పరస్, మెగ్నీషియం, విటమిన్లు శరీరానికి లభించి రోగ నిరోధక శక్తి పెంపొంది ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. అనంతరం పిల్లల బరువు, ఎత్తు తీసి తక్కువ బరువు పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. కార్యకర్త పి.నాగమణి, ఆశా, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పెద్దారవీడు: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మీదేవి అన్నారు. మండల పరిధిలో ఓబులక్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలపై బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం గురువారం ఏర్పాటు చేశారు. తొలుత గ్రామంలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి ఆహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, పిల్లల ఎదుగుదల్లో పౌష్టికాహారం ఎంతో కీలకమని, రోజూ పాలు, గుడ్లు, కురగాయాలు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యకర్తలు టీవీ వెంకటలక్ష్మమ్మ, డి.కృష్ణవేణి, డి.వీరనాగులు, డి.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

దర్శి: పౌష్టికాహార మాసోత్సవాలను లంకోజనపల్లి అంగన్‌వాడీ నాగమల్లేశ్వరి అధ్యక్షతన ఆ కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ భారతి మాట్లాడుతూ తక్కువ ధరలతో ఎక్కువ పోషక విలువలు కలిగిన పౌష్టికాహరం తీసుకోవాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు పౌష్టికాహార మాసోత్సవాలు జరుగుతాయన్నారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార మాసోత్సవాలు జరపాలని సూచించారు. పౌష్టికాహర పదార్థాలైన చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను అందరికీ పంచి పెట్టారు. పంచాయతీ కార్యదర్శి సునీత, సూపర్‌వైజర్‌లు అనూరాధ, ఆనందలత, ఐటీపీ ప్రథమ్ వెంకట్రావు, సుగుణ, హెల్త్ ఎంఎల్‌హెచ్‌పీ స్రవంతి, ఆయాలు నాగమణి, పెద్దక్క, ఆశాలు శారద పాల్గొన్నారు.